
గండిపాళెం ప్రాజెక్ట్ అభివృద్ధికి చర్యలు

- గేట్లు, కాలువల మరమ్మతులకు నిధుల మంజూరు
- సాగునీటి సంఘాల ద్వారా పనులు
- నెలలోపు పూర్తి చేసేందుకు ప్రణాళికలు


అభివృద్ధికి నోచుకోని చెరువు


తక్కువ నీటిమట్టంతో ఉన్న గండిపాళెం ప్రాజెక్ట్

ఉదయగిరి: మెట్టప్రాంత వరప్రసాదినిగా పేరు పొందిన గండిపాళెం జలాశయం అభివృద్ధికి రూ.74 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీని ద్వారా ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు చేపడుతారు. అలాగే కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులు, ముళ్ల పొదల తొలగింపు పనులు చేపడుతారు. దీంతో నీరు సజావుగా రైతుల పొలాలకు చేరనుంది. ఈ పనులను నామినేషన్ పద్ధతిలో సాగునీటి సంఘాలు చేపడుతాయి. నెల రోజుల్లోపు పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

16 వేల ఎకరాల ఆయకట్టు

గండిపాళెం జలాశయం ద్వారా వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 16 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. వీటిలో కుడి కాలువ ద్వారా జి.కొండారెడ్డిపల్లి, కొత్తపల్లి, గుడినరవ, దుంపవారిపల్లి, తిరుమాలపురం గ్రామాల పరిధిలో 5 వేల ఎకరాలు సాగులో ఉంది. ఎడమ కాలువ ద్వారా గండిపాళెం, ఇసుకపల్లి, గువ్వాడి, కాంచెరువు, యర్రంరెడ్డిపల్లి, గొల్లపల్లి, కొండాయపాళెం తదితర గ్రామాల్లో 11 వేల ఎకరాలు సాగులో ఉంది. వీటి పరిధిలో ఉన్న ఉప కాలువలు చాలా అధ్వానంగా ఉన్నాయి. దీంతో సాగునీరు పొలాలకు చేరే అవకాశం లేకుండాపోయింది. ఈ క్రమంలో జపాన్ బ్యాంకు రుణంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రూ.25 కోట్లు ఖర్చు చేసి ముఖ్యమైన కాలువల సిమెంట్ లైనింగ్ పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాజెక్టు గేట్లు మరమ్మతుల కోసం నిధులు కేటాయించారు. ఇందులో కొంతమేర పనులు చేపట్టారు. అప్పటి ఇరిగేషన్ అధికారుల తీరుతో పనుల్లో జాప్యం జరిగింది. గత ప్రభుత్వంలోనే పలు కాలువల పూడికతీత పనులు కూడా చేశారు. ప్రస్తుతం గేట్ల రిపేర్లు, కాలువల పూడికతీత పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

రూ.74 లక్షలు మంజూరు

గండిపాళెం ప్రాజెక్టు కోసం రూ.74 లక్షల నిధులు మంజూరైంది. వీటితో పాటు ఉదయగిరి మండలంలోని తిరుమలాపురం, పుల్లాయపల్లి, బండగానిపల్లి, దాసరిపల్లి, లింగమనేనిపల్లి చెరువుల అభివృద్ధి కోసం మరో రూ.16 లక్షలు మంజూరు అయ్యాయి. సీతారామపురం మండలంలో స్వామి చెరువు, ఊట చెరువు, మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి, మర్రిఊట్ల రిజర్వాయర్ కోసం నిధులు మంజూరయ్యాయి. సాగునీటి సంఘాల ద్వారా పనులు చేయిస్తాం. నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తాం.

– చంద్రమౌళి, డీఈ, ఇరిగేషన్ ఉదయగిరి

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 500 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 355 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా, వివిధ కారణాలతో 145 బేళ్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160 పలుకగా, సరాసరి రూ.219.99 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. 50 వేల ర్యాంక్ వరకు కౌన్సెలింగ్‌ను నిర్వహించామని, 2, 3వ తేదీల్లో 90 వేల ర్యాంక్ వరకు, 4, 5 తేదీల్లో చివరి ర్యాంకుల అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. పాలిసెట్ పరీక్ష రాయని పదో తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

స్వగ్రామంలో ఆదాల సందడి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆదాల

అల్లూరు: నెల్లూరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన స్వగ్రామమైన అల్లూరు మండలం నార్తుమోపూరులో మంగళవారం సందడి చేశారు. బంధువులు, గ్రామస్తులతో సరదాగా గడిపారు. గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ప్రజలతో మమేకమై పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



సంగం: మండలంలోని తరుణవాయి జెడ్పీ హైస్కూల్‌లో గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు చల్లా ప్రభాకర్ యాదవ్ తన తండ్రి పెంచలయ్య జ్ఞాపకార్థం నగదు ప్రోత్సాహకాలను మంగళవారం అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన పి.మధుచరణ్‌కు రూ.5 వేలు, రెండో స్థానంలో నిలిచిన బి.జ్యోతికి రూ.3 వేలు, మూడో స్థానంలో నిలిచిన యు.మేఘశ్యామ్‌కు రూ.2 వేల నగదు ప్రోత్సాకం అందజేశారు. హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శిపై విచారణ

కావలి (జలదంకి): కావలి మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తూ గతంలో సస్పెండ్ అయిన వావిళ్ల భాస్కర్‌ను గూడూరు మున్సిపల్ కమిషనర్ అన్నవరపు వెంకటేశ్వర్లు మంగళవారం విచారణ చేపట్టారు. ఆ వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆయన తెలిపారు.

టోల్‌బూత్‌ను ఢీకొన్న వాహనం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్‌బూత్‌ను చికెన్ వ్యర్థాలతో వెళ్తున్న ఐషర్ వాహనం మంగళవారం ఢీకొంది. కర్ణాటక నుంచి చికెన్ వ్యర్థాలతో సంగానికి వచ్చి డంప్ చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో డీసీపల్లి సమీపంలోని టోల్ బూత్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బూత్‌లో ఉన్న సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు. టోల్ సిబ్బంది వాహనాన్ని నిలిపివేయడంతో చికెన్ వ్యర్థాల దుర్వాసనతో జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి

ఉదయగిరి రూరల్: పట్టణంలోని షబ్బీర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు మంగళవారం డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కళాయిల ద్వారా తాగునీరు రాకపోవడంతో తాము పలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీ సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా అరకొరగా నీటి సరఫరా జరుగుతోందన్నారు. ఫలితంగా నీటి కష్టాలను ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కావలిలో తప్పిన పెను ప్రమాదం


చెట్టును ఢీకొన్న టిప్పర్

కావలి (జలదంకి): కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డు పురపాలక పాఠశాల సమీపంలో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. ఓ టిప్పర్ లారీ ఇంజన్ భాగంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన డ్రైవర్ రన్నింగ్‌లోనే బయటకు దూకేశాడు. దీంతో టిప్పర్ రోడ్డు పక్కకు వెళ్లి చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. గమనించిన వ్యాపారులు, ప్రయాణికులు మంటలను అదుపుచేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఆటో, ద్విచక్ర వాహనం స్వల్పంగా దెబ్బతిన్నాయి.

జగన్ పర్యటన అంటేనే కూటమికి వణుకు

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన అంటేనే కూటమి సర్కార్ భయంతో వణికిపోతోందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలపై బయటకు వస్తే ప్రభుత్వ పెద్దలకు ఎక్కడా లేని భయం కలుగుతోందన్నారు. అందువల్లే పోలీసులతో చిత్రవిచిత్రమైన ఆంక్షలు విధించి అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏడాదిలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. దీనివల్ల జగన్ పర్యటనలను విఫలం చేయాలని ప్రభుత్వం పోలీసుల సాయంతో ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేయడం, హెలీప్యాడ్‌కు అనుమతి ఇవ్వకపోవడం, ప్రజలను రాకుండా నిలుపుదల చేయాలని చూస్తుండడం అత్యంత దారుణమన్నారు. ఇటీవల కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి తనను బెంగళూరుకు పంపించేస్తానని ప్రగల్భాలు పలికాడని, నేను ఎక్కడికి వెళ్తానో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నారు. ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులు చేయకుండా ఇలా అహంకారపూరితంగా మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జంపాని రాఘవులు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, మద్దిబోయిన వీరరఘు, షాహుల్ హమీద్, దయాకర్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, పేరం వెంకటేశ్వర్లు, సుందరరాజు, సన్నిబోయిన ప్రసాద్, వాయిల తిరుపతి, వంశీరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పర్యటన తేదీ ఖరారు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనపై కూటమి ప్రభుత్వం కుట్రలు చేసిందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ జగన్ పర్యటనకు రోడ్డు మార్గం కూడా లేని అటవీ ప్రాంతంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించడం దారుణమన్నారు. దీనితో పాటు అనేక కారణాల వల్ల పర్యటన రద్దు అయ్యిందని, త్వరలోనే తేదీని ప్రకటిస్తారని తెలిపారు.

చేపలవేట సాగిస్తే చర్యలు


జలాశయ పరిసరాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల జలాశయంలో మంగళవారం నుంచి చేపలవేట నిషేధం అమలులో ఉంది. ఈ క్రమంలో జలాశయ పరిసర ప్రాంతాలను మత్స్య శాఖ ఏడీ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా చేపలవేట సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి మత్స్యకారుడు వేట నిషేధానికి సహకరించాలని కోరారు. ఈ ఏడాది పకడ్బందీగా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఎఫ్‌డీఓ సురేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



కావలి రెడ్‌క్రాస్ కార్యాలయంలో వైద్యులకు సన్మానం

కావలి (జలదంకి): కావలి రెడ్‌క్రాస్ కార్యాలయంలో డాక్టర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కావలి పట్టణానికి చెందిన వైద్యులు శ్రీధర్, మనోహర్‌బాబు, రమ్యలను రెడ్‌క్రాస్ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కావలి చైర్మన్ డాకారపు రవిప్రకాష్, వైస్ చైర్మన్ కోర్సిపాటి హరినారపరెడ్డి మాట్లాడుతూ వైద్యుల సేవలు ఎంతో గొప్పవని, వారిని తగిన విధంగా సన్మానించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. అనంతరం రోగులకు దాతల సాయంతో డ్రైఫ్రూట్స్ అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

- సంగం: సంగం పీహెచ్‌సీలో డాక్టర్స్ డే సందర్భంగా ప్రైమరీ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డిని సన్మానించారు. అసోసియేషన్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జగన్‌మోహన్‌రావు, పీఎంపీలు చిన్న, మహేష్ పాల్గొన్నారు.
- కలిగిరి: కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డిని సత్కరించారు. వైద్యసిబ్బంది సాయిలక్ష్మి, నారాయణరాజు, తిరుపతిరావు, మేరి, దొరసానమ్మ తదితరులు పాల్గొన్నారు.
- వింజమూరు (ఉదయగిరి): వింజమూరులోని మాశిలామణి చిన్నపిల్లల వైద్యశాలలో డాక్టర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాశిలామణి, ప్రశాంత్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణంపోసే వృత్తిలో ఉన్న వైద్యులు బాధ్యతగా వ్యవహరిస్తూ సేవలందించాలన్నారు.


సంగం పీహెచ్‌సీలో..


కలిగిరి పీహెచ్‌సీలో..


వింజమూరులో..

ఆత్మీయ సన్మానం


సంగం: మస్తానయ్య దంపతులకు సత్కారం


సంగం: శ్రీనివాసులు దంపతులకు సత్కారం


మర్రిపాడు: మస్తానయ్యకు సత్కారం

సంగం: విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ పీసీ మస్తానయ్య పదవీ విరమణ వేడుకలను స్థానిక తుంగా దయాకర్‌రెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ చౌదరి, పలువురు అధికారులు, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొని మస్తానయ్య దంపతులను సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బుచ్చి సబ్ డివిజన్ ఏడీ సతీష్, ఏఈ మన్మధరావు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

- సంగం: సంగం ఇరిగేషన్ సెక్షన్‌లో లస్కర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసులును ఇరిగేషన్ కార్యాలయంలో ఏఈ వినయ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఇరిగేషన్ డీఈ పెంచలయ్య, ఏఈలు, నాయకులు, సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొని, శ్రీనివాసులు దంపతులను సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఈ కృష్ణ, వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.
- మర్రిపాడు: నందవరం ఆదర్శ పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన తుమ్మలూరి మస్తానయ్యను పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ



దుత్తలూరు: దుత్తలూరు ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న జంట హత్యలు, భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనా స్థలాన్ని కావలి డీఎస్పీ శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే భార్య వెంకాయమ్మ గాయాలను పరిశీలించి హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

అభినందన

దుత్తలూరు: విజయవాడలోని ఎస్‌ఎస్ కన్వెన్షన్ హాల్లో మంగళవారం జరిగిన బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ ప్రమాణ స్వీకారోత్సవానికి ఉదయగిరి నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, కదిరి వెంకటరంగారావు, మాధవరావు, మల్లికార్జున్‌నాయుడు, చినమాలకొండయ్యలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన


ఉదయగిరి రూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయభాస్కర్


సంగం మండలంలో..


మర్రిపాడు: సూచనలు ఇస్తున్న ఏఓ కవిత

ఉదయగిరి రూరల్: ఎరువుల యాజమాన్యంపై రైతులు సరైన అవగాహన కలిగి ఉండాలని ఉదయగిరి వ్యవసాయాధికారి పి.విజయ్‌భాస్కర్ అన్నారు. ఆయన శకునాలపల్లి, కృష్ణంపల్లి సచివాలయాల పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానందున విత్తన ఎంపిక, విత్తన శుద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు కల్లూరి రాజశేఖర్‌రెడ్డి, కుందూరు వినోద్, వీఏఏలు చల్లా పూజిత, పశుసంవర్ధక శాఖ సహాయకుడు కన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

- సంగం: మండలంలోని మర్రిపాడు, జంగాలకండ్రిక గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఏఓ శశిధర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రామ్మోహన్ స్థానిక వరి పొలాలను సందర్శించారు. సర్పంచ్ గంగపట్నం సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.
- అల్లూరు : చీడపీడలపై రైతులకు అవగాహన అవసరమని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని నార్తుమోపూర్, ఇందుపూరు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు పొందాలంటే రైతు విశిష్ట సంఖ్య అవసరమన్నారు.
- మర్రిపాడు : మండలంలోని భీమవరం కండ్రిక, పొంగూరు గ్రామాల్లో ఏఓ కవిత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పెసర, మినుము, వేరుశనగ పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, వీఏఏలు ప్రవీణ్‌సాయి, పెంచలయ్య పాల్గొన్నారు.


అల్లూరులో..

రేపట్నుంచి ఇంటింటికీ తిరుగుతాం


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా రేపట్నుంచి నెలరోజుల పాటు ఇంటింటికీ తిరిగి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి గడపకు వెళ్లే కార్యక్రమం రూపొందించినట్లు వివరించారు. ప్రతిరోజు 30 నుంచి 50 కుటుంబాలను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భూమిరెడ్డి పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, ఇరిగేషన్ ఈఈ ఎం.రవి, తహసీల్దార్ పద్మజాకుమారి, ఎంపీడీఓ రఫీఖాన్, డీఏఓ సత్యవాణి, వ్యవసాయాధికారి సత్యభాను, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


నాగేశ్వరరావు (ఫైల్)

ఆత్మకూరు: పట్టణానికి చెందిన నిడమనూరు నాగేశ్వరరావు (50) రెండు రోజులుగా కనిపించడం లేదని బంధువులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న నాగేశ్వరరావు సోమవారం దుకాణం తెరిచేందుకు వెళ్లి తిరిగి రాలేదని, దీంతో తెలిసిన వారి వద్ద విచారణ చేసినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.